రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో నల్లపోచమ్మకు బోనాలు



మైలార్‌దేవ్‌పల్లి: రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో అలియాబాద్ మహిళా విభాగం సౌజన్యంతో నల్ల పోచమ్మ బోనాల జాతర ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహవీర్ కళాశాల చైర్మన్ సంరెడ్డి జయలక్ష్మి, రాష్ట్ర మహిళా రెడ్డి సెక్రటరీ అగ్నిహోత్రి మహవీర్ గ్రూప్ విద్యా సంస్థల బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



డ్రైనేజీ క్లీనింగ్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. '100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు' కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ సంజయ్‌గాంధీనగర్ కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ వసిఅలీ, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాల పంపిణీ



రుణాలు పంపిణీ చేస్తున్న చైర్మన్ సతీశ్

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం సొసైటీ పరిధిలోని రైతులకు మంగళవారం రుణాలు పంపిణీ చేశారు. రూ. 1.35 లక్షలు దీర్ఘకాలిక రుణాలు, రూ.49.80 లక్షల పంట రుణాలను రైతులకు అందించామని సొసైటీ చైర్మన్ బి.సతీశ్ సూచించారు. అలాగే సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

భవనాన్ని సీజ్ చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు



అత్తాపూర్: అనుమతుల్లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ.. లంగర్‌హౌజ్ బ్రిడ్జికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఎలాంటి అనుమతుల్లేకుండానే ఓ భారీ నిర్మాణాన్ని చేపడుతున్నారన్నారు. ఇదే విషయమై పలుమార్లు నోటీసులు అందించినా స్పందన లేదన్నారు. దీంతో జీహెచ్‌ఎంసీ యాక్ట్ ప్రకారం మంగళవారం భవనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. కొత్తగా భవన నిర్మాణాలు చేపట్టేవారు తప్పనిసరిగా జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతులు పొందాలని సూచించారు.

యువతి అదృశ్యం



హేమ్ కుమారి

శంషాబాద్ రూరల్: యువతి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన జితేంద్ర కుమార్ చతుర్వేది కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధి కోసం మదన్‌పల్లికి వలస వచ్చాడు. ఈనెల 14న కుటుంబ సభ్యులు పనికి వెళ్లారు. ఇంట్లో ఉన్న అతని సోదరి హేమ్‌కుమారి చతుర్వేది (19) ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి హేమ్‌కుమారి కనిపించలేదు. పలుచోట్ల వెతికినా జాడ తెలియలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డే..పార్కింగ్..!

- శంషాబాద్ ప్రధాన రహదారిపై ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్
- రాకపోకలకు వాహనదారులు, పాదచారుల ఇబ్బందులు



బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్ ఎదుట జాతీయ రహదారిపై నిలిపిన వాహనాలు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారులపైనే కొందరు వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అటు ఇతర వాహనదారులు, ఇటు పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

◆ బస్టాండ్ సమీపంలోని ప్రధాన హోటల్‌తో పాటు సంగీత మొబైల్‌కు ఎదురు, పక్కనే ఉన్న హోటళ్లకు ఎలాంటి పార్కింగ్ సౌకర్యాలు లేవు. ఇందులోకి వచ్చేవారు జాతీయ రహదారిలో సగభాగం వరకు ఆక్రమించుకుని ఇష్టారాజ్యంగా తమ వాహనాలను పార్కింగ్ చేసి వెళ్లి వస్తుంటారు. గంటల తరబడి నిలిపి ఉంటున్న వాహనాలతో అటుగా ప్రయాణించే వాహనదారులు నిత్య నరకం చూస్తున్నారు. ఇతర వాణిజ్య దుకాణదారులు కూడా తమ దుకాణంలోకి అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొందని దీంతో పాటు తమ వ్యాపారం కూడా దెబ్బతింటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు కొన్ని సందర్భాల్లో మొక్కుబడి చర్యలు తీసుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని, ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ఫలహారం బండ్ల ఊరేగింపు



ఉడ్డంగడ్డలో పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని వివిధ బస్తీల్లో ఘట్టాలు, తొట్టెలతో పాటు ఉడ్డంగడ్డ హనుమాన్ ఆలయ పరిధిలో నిర్వాహకులు ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, బ్యాండు వాయిద్యాల నడుమ యువకుల కేరింతలు కొడుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పాల్గొనగా నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. బీఆర్‌ఎస్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు కూడా హాజరయ్యారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్, సీనియర్ నాయకులు రాముయాదవ్, రాఘవేందర్, గుమ్మడి కుమార్, మైసిరెడ్డి, జి.రాజు, ప్రవీణ్, ఈశ్వర్, జగదీశ్, సురేశ్, భూదేవి, సరిత, సునీల్, ఏ.మహేశ్, అశోక్‌కుమార్, జగన్ ముదిరాజ్ , లడ్డాయాదవ్, శివయాదవ్, ఎస్.రాజేశ్‌యాదవ్, సందీప్, వరుణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పికిల్‌బాల్‌కు ఆదరణ



గెలుపొందిన క్రీడాకారులు

మణికొండ: దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పికిల్ బాల్‌కు ఆదరణ పెరుగుతోందని పికిల్ అవుట్ సీఈఓ అపర్ణ రావు అన్నారు. హైదరాబాద్ నగర శివారు కోకాపేటలోని క్రాస్ కోర్ట్ స్పోర్ట్స్ క్లబ్‌లో హైదరాబాద్ పికిల్‌బాల్ ఛాంపియన్ షిప్-2025 పోటీలు మంగళవారం ముగిశాయి. పురుషుల డబుల్స్, సింగిల్స్, మహిళల డబుల్స్, సింగిల్స్ మిక్స్‌డ్ డబుల్స్, 35 ఏళ్ల పైబడిన వారి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇవే మొదటి పోటీలు అని హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు, విశాఖపట్నం లాంటి పట్టణాల నుంచి అగ్రశ్రేణి క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. పురుషుల డబుల్స్‌లో సమీర్, నిఖిల్, సింగిల్స్‌లో రషీన్ శామ్యూల్, మహిళల డబుల్స్‌లో రితిక, జోషిక, సింగిల్స్‌లో రితిక, మిక్స్‌డ్ డబుల్స్‌లో రితిక, అనిష్ రాణించడంతో వారికి మెమెంటోలు అందించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేశ్‌బాబు

గచ్చిబౌలి: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని రోటరీ క్లబ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు పేర్కొన్నారు. కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలోని సంస్కృతి హైస్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను రోటరీ క్లబ్ సేవల ప్రణాళిక పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలతో పాటు కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కూడా తమ కార్యక్రమాలను విస్తరిస్తున్నామన్నారు. సోషల్ మీడియా, టీవీ, ఫోన్, సిగరెట్, గుట్కా, గంజాయి, డ్రగ్స్ లాంటివి యువతకు పెద్ద శత్రువులని వాటికి దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్‌కు బాటలు పడుతాయన్నారు. సంస్కృతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసే కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యదర్శి వనశ్రీ మాట్లాడుతూ..తల్లిదండ్రులు, సమాజాన్ని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ లక్ష్మణ్ మన జాగృతి కమిటీ సభ్యులు డాక్టర్ చల్లా గీత పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో ఎఫ్‌టీసీసీఐ కీలకపాత్ర



నాంపల్లి: రాష్ట్రంలోని పరిశ్రమల అభివృద్ధికి అగ్రగామికిగా ఉన్న ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) రెడ్‌హిల్స్‌లోని ప్రధాన కార్యాలయంలో కొత్త సమావేశ మందిరాన్ని ప్రారంభించింది. ఈ హాల్‌కు రామా హాల్ అని పేరు పెట్టారు. ఎఫ్‌టీసీసీఐ సభ్యుడు, దాత రాజేందర్ అగర్వాల్ విరాళంగా అందించిన మొత్తంతో రామా హాల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ హాల్‌ను ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నందున ఎఫ్‌టీసీసీఐకు అభినందనలు తెలియజేశారు. సీనియర్ కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొన్నారు.

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు



ఇంట్లో చెలరేగుతున్న మంటలు

మైలార్‌దేవ్‌పల్లి: టీఎన్‌జీవోస్ సాయికాలనీలో మంగళవారం ఉదయం ప్రమాదం తప్పింది. సత్యనారాయణ ఇంట్లో అద్దెకు ఉంటున్న చెన్నమ్మ టీ చేస్తుండగా సిలిండర్ పైపు నుంచి గ్యాస్ లీక్ అయింది. ఈ క్రమంలో సిలిండర్ నుంచి మంటలు ఎగసి పడడంతో ఆమె భయంతో కేకలు వేసింది. ఆ సమయంలో రోడ్డు మీదుగా వెళ్తున్న ఆదర్శకాలనీకి చెందిన బాలు, పక్క రెసిడెన్సీకి చెందిన ధనరాజ్ గమనించి ఇంట్లోకి వెళ్లి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అలాగే వెంటనే 100, 101 నంబర్లకు కాల్ చేసి పోలీసులు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే మైలార్‌దేవ్‌పల్లి ఎస్‌ఐ విశ్వనాథ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని చుట్టుపక్కల నివాసితులకు గ్యాస్ లీక్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇద్దరు యువకులు చూపిన సాహసానికి పోలీసులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

విద్యార్థినికి చేయూత



విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

మణికొండ: నిరుపేద విద్యార్థినికి పలువురు నాయకులు అండగా నిలిచారు. మున్సిపాలిటీ కేంద్రంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన జ్యోత్స్న ఎంసెట్‌లో 964 ర్యాంకు సాధించి ఓ ప్రముఖ కాలేజీలో ఉచిత సీటు సాధించింది. అయితే ఇతర ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న మణికొండ మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, నాయకులు బి. శ్రీరాములు, శ్రావణ్‌కుమార్, శ్రీలక్ష్మి, భానుచందర్ మంగళవారం విద్యార్థినికి రూ. 25 వేలను అందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మణికొండ: మున్సిపాలిటీలోని పుప్పాలగూడ గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. తర్వాత ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 60 వేల ఆర్థిక సాయం మంజూరైంది. స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీరాములు, శ్రావణ్‌కుమార్ కలిసి మంగళవారం బాధితుడికి చెక్కును అందజేశారు.

అంగన్‌వాడీకేంద్రంలో 'బ్లూ డే'



కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, చిన్నారులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'బ్లూ డే' కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ జ్యోతి బ్లూ కలర్‌పై చిన్నారులకు అవగాహన కల్పించారు. అంతేగాకుండా బ్లూ రంగు కాగితంలో పడవ, ఇతర ఆకృతులు తయారు చేయించారు. అలాగే వ్యర్థాలతో రకరకాల ఆకృతులను తయారు చేసి వాటికి రంగులు వేసి వారు మెడలో ధరింపజేశారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో తీరిన తాగునీటి సమస్య

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి తిప్పలు తప్పాయి. మాణిక్‌రెడ్డి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు సంజీవరెడ్డి పర్యవేక్షణలో మంగళవారం విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు మోటారును బాగు చేయించి బోర్‌కు బిగించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. రూ.9 వేల వ్యయంతో అసోసియేషన్ ఆధ్వర్యంలో పనులు చేపట్టామని వారు తెలిపారు.

సన్మానం

గోల్కొండ: తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతుందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎస్.రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ మంగళవారం ఆయనను కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడుగా నియమితులైన సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ..తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

బదిలీలతో కూడిన ప్రమోషన్లు చేపట్టాలి



సభ్యత్వ నమోదులో ఎస్‌టీయూటీఎస్ నాయకులు

అత్తాపూర్: ఉపాధ్యాయులకు బదిలీలతో కూడిన ప్రమోషన్లు కల్పించాలని ఎస్‌టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌టీయూ సభ్యత్వ నమోదును మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బదిలీలు చేయకుండా పదోన్నతులు కల్పిస్తే సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోతారన్నారు. అలాగే ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, 2008 డీఎస్సీ నుంచి ఇటీవల నియమితులైన ఉపాధ్యాయులకు 6 నెలలుగా వేతనాలు లేనందున వెంటనే చెల్లించాలని కోరారు. కేజీబీవీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పే స్కేల్ ఇవ్వాలని ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, 2003 డీఎస్సీ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏఐఎస్‌టీఎఫ్ ఉపాధ్యక్షుడు పరమేశ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామిశెట్టి వెంకటయ్య, ఆంజనేయులు, నాయకులు సలోమి, స్నేహలత, సుష్మ, మాధవి, వాణి, వాణిశ్రీ, నాగమణి, మహేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటులో భాగస్వాములవ్వాలి



జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి ఎన్ భవానీ శ్రీ

ఏజీవర్సిటీ: పసుపు బోర్డు ఏర్పాటులో రైతులు, వ్యాపారులు భాగస్వాములు కావాలని జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి ఎన్ భవానీ శ్రీ అన్నారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్స్)లో జాతీయ పసుపు బోర్డు, నార్మ్స్ ఆధ్వర్యంలో వాటాదారులు, స్టార్టప్‌ల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు, వ్యాపారులు, పరిశోధకులు, పరిశ్రమల నాయకుల నుంచి అట్టడుగు స్థాయి ద్వారా రూపొందించబడిన ఐదేళ్ల వ్యూహాత్మక రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. నార్మ్స్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ మాట్లాడుతూ.. పంట కోత తర్వాత నష్టాల నివారణతో పాటు పసుపు విలువ గొలుసును బలోపేతం చేసేందుకు సహకరించాలని, ఆలోచనాత్మకంగా ఆలోచించాలని కార్యాచరణ పరిష్కారాలను ప్రతిపాదించాలని కోరారు. రైతుల అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. రైతు ఆదాయాన్ని పెంచడం, వినియోగదారులకు సేవలను మెరుగుపరచడం కోసం పసుపు బోర్డు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో వాటాదారులు, స్టార్టప్‌లు, వ్యవస్థాపకులు, విద్యావేత్తలు, నేషనల్ పసుపు బోర్డు ప్రతినిధులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, వివిధ బ్యాంక్‌ల అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు, పసుపు బోర్డు ప్రతినిధులు

వాలంటరీలో బోనాల సందడి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని వాలంటరీలో మంగళవారం బోనాల సందడి నెలకొన్నది. ఈ సందర్భంగా వాలంటరీ ఉద్యోగులు ప్రధాన గేటు నుంచి ఫలహారపు బండ్లు, తొట్టెలతో బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. వాలంటరీ డీజీ ఎం.అనిత, ఎస్ఈ పి.వి.నాగేందర్, ఈఈ రవీంద్రారెడ్డి, ఏఈ నాగేశ్వర రావు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బోనాలు సమర్పించిన అనంతరం సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో డీఈఈలు ఝాన్సీ, అనితాయాదవ్, డీడీఏ సునీత, శంకర్ ప్రసాద్, రాజుస్వామి, శ్రీశైలం, ముత్యాలు, రాజు గౌడ్, వై.ముత్యాలు, కృష్ణాచారి, పద్మరాజు, శివ కుమార్, శంకర్, నరసింహ, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





ఆలయంలో బోనాలతో మహిళా ఉద్యోగులు తదితరులు

అధికారుల ఫిర్యాదుపై దర్యాప్తు ముమ్మరం

అబిడ్స్: జీఎస్టీ వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్లు కె.శ్రీనివాస్, జి.వేణుగోపాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై అబిడ్స్ పోలీసులు వివరాల సేకరణ ముమ్మరం చేశారు. మంగళవారం అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఏ ఇమాన్యుయేల్ ఇద్దరి అధికారుల ఫిర్యాదును కోర్టుకు పంపినట్లు తెలిపారు. కోర్టు సలహా మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతంగా చేపడతామని ఆయన వివరించారు. అబిడ్స్ డివిజన్ జీఎస్టీ అడిషనల్ కమిషనర్ జి.లావణ్య తమను పలు విధాలుగా వేధిస్తుందని బషీర్‌బాగ్ జీఎస్టీ సర్కిల్-1, సర్కిల్-2 అసిస్టెంట్ కమిషనర్లు కె.శ్రీనివాస్, జి.వేణుగోపాల్ రెడ్డిలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో వాణిజ్యపన్నుల శాఖలో సంచలనంగా మారింది. ఈ ఘటన హాట్ టాపిక్‌గా కొనసాగింది. ఇద్దరు అధికారులు చీఫ్ సెక్రెటరి రామకృష్ణారావు, వాణిజ్యపన్నుల శాఖ మిషనర్ హరితకు కూడా ఫిర్యాదు చేయడంతో వేగంగా ఉన్నతాధికారులు స్పందించారు. అబిడ్స్ డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ జీఎస్టీ అడిషనల్ కమిషనర్‌గా కొనసాగుతున్న లావణ్యను ఉన్నతాధికారులు మంగళవారం బదిలీ చేశారు. ఆమె స్థానంలో దీపారెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అడిషనల్ కమిషనర్ లావణ్యను వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు.

ఏరియా ఆసుపత్రులకు ఆదరణ



మాట్లాడుతున్న ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ పుష్ప

గోల్కొండ: ఏరియా ఆసుపత్రులకు ఆదరణ రోజురోజుకు పెరుగుతుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ పుష్ప అన్నారు. మంగళవారం ఆమె గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ముందుగా ఆమె ఆసుపత్రిలోని ఔట్‌పేషంట్ విభాగాన్ని సందర్శించి అక్కడ ఉన్న వారితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె ఇన్‌పేషంట్ వార్డును సందర్శించి అక్కడ ఉన్న రోగులతో మాట్లాడారు. ఆసుపత్రి మెడికల్ సూపరిండెంటెంట్ పి.వి.శ్రీనివాసరావు ఆసుపత్రి వైద్యులతో ఆమె సమావేశమయ్యారు. వైద్యులు క్రమశిక్షణతో పనిచేస్తూ ఏరియా ఆసుపత్రులకు వన్నెతేవాలన్నారు. ఆసుపత్రి కాయాకల్ప్ అవార్డు పొందిందని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు ఆమెకు వివరించారు.

వర్సిటీల్లో ఉద్యోగాలకు నోటిఫికేషన్లను విడుదల చేయాలి



ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

నాంపల్లి: రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ల ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హరీష్ గౌడ్, టీజీవీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం మాసబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. విశ్వవిద్యాలయాల్లో డిగ్రీ చదివే విద్యార్థులకు నెలకు మూడు వేలు, పీజీ విద్యార్థులకు ఐదు వేలు స్కాలర్‌షిప్ ఇవ్వాలన్నారు. పీహెచ్‌డీ చేస్తున్న పరిశోధక విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ఫెలోషిప్ ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు జాతీయ ఫెలోషిప్‌లు పొందాలంటే నెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అనే నిబంధనను తొలగించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి యూజీసీకి లేఖ రాయాలని వారు ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డిని కోరారు.